క్లుప్తంగా

సారా అమ్మితే కఠిన చర్యలు


గొలుగొండ ఎస్‌ఐ రామారావు

గొలుగొండ : నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని గొలుగొండ ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జోగుంపేటకు చెందిన దుర్గాప్రసాద్ 10 లీటర్ల నాటుసారా అమ్మకాలు కోసం దాచి ఉంచిన నేరంపై ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందన్నారు. సారా తయారీ, అమ్మకాలపై గట్టి నిఘా ఉంచామని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా ఎక్కడపడితే అక్కడ బాణాసంచా అమ్మకాలు చేసినా కేసులు నమోదు చేస్తామని అమ్మకాలు చేసే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు.

రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెల్లి కులస్తుల సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు

గొలుగొండ : రాష్ట్రంలో రెల్లి కులస్తులు 20 లక్షలకు పైగా ఉన్నారని, ఇటువంటి వెనుకబడిన వారికి ఒక్కశాతం రిజర్వేషన్ ఇవ్వడం తగదని, 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర రెల్లి కుల సంఘం అధ్యక్షుడు మంగళగిరి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఆయన మండలంలో ఏఎల్ పురంలో జరిగిన రెల్లి కుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క శాతమే రిజర్వేషన్ కల్పించడంపై ఆవేదన చెందారు. సహజంగా రెల్లి కులస్తులు బాగా వెనుకబడి ఉన్నారని వారికి రిజర్వేషన్ పెంచాలని కోరారు. రిజర్వేషన్ పెంచకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కులసంఘం నేతలు ఎర్రంశెట్టి అప్పన్న, మజ్జి నారాయణమూర్తి, కోన రాంబాబు పాల్గొన్నారు.

జోరుగా సీసీ రోడ్ల పనులు


మాడుగులలో షిరిడీ సాయి బాబా ఆలయ సమీపంలో వేసిన రోడ్డు

మాడుగుల: మాడుగులలో పంచాయతీ నిధులతో పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 4 వ వార్డులో రూ.1.50 లక్షలతో భమిటిపాటి వారి వీధిలో షిరిడిసాయి బాబా ఆలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్లు పనులు పూర్తయ్యాయి. దీంతో షిరిడీ సాయి ఆలయానికి రాకపోకలు సులభతరం అవుతాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గొలుగొండ : గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థులు అధికంగా రావడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రాజుబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి చదవడం, రాయడంపై ఆసక్తి చూపినప్పుడే మంచి విద్యను అభ్యసించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు గ్రంథాలయం ఆవశ్యకతను తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

దేవరాపల్లి : మండల సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు తెలిపారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, శాఖల వారీ తగు సమాచారంతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ప్రధానరోడ్లు...నరకానికి నకళ్లు


గొలుగొండలో కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధాన రోడ్డు దుస్థితి


చోద్యం వద్ద బురదమయంగా మారిన కంఠారం రోడ్డు

- నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం
- వాహనదారులకు ఇక్కట్లు
- రోడ్ల మరమ్మతులు పట్టని ప్రభుత్వం

గొలుగొండ : ప్రధాన రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడ ఏం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. నిత్యం వాహనదారులు ఏదో చోట ప్రమాదానికి గురి అవుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లు బాగుచేస్తామని చెప్పడం తప్ప ఇప్పటి వరకు రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రధానరోడ్లు దుస్థితి ఇంత దారణంగా ఉంటే చిన్న, చిన్న గ్రామాలకు వెళ్లే రోడ్లు మరింత అధ్వానంగా ఉన్నాయి.
మండలంలో మూడు ప్రధాన రోడ్లు ఉన్నాయి. కృష్ణదేవిపేట- నర్సీపట్నం మార్గంలో గొలుగొండ, లింగంపేట, రామచంద్రపురం వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడడం వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. వర్షాలు కురవడంతో గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులకు రోడ్లు సరిగ్గా కనిపించక వాహనాలు పల్టీ కొడుతున్నాయి. ఎంతో క్షతగాత్రులు కాగా మరికొంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కంఠారం రోడ్డు వెళ్లే మార్గంలో చోద్యం, చోద్యం హైస్కూల్ ప్రాంతాల్లో రోడ్డు మరింత కోతకు గురికావడం జరిగింది. ఈ రోడ్డు మన్యం అల్లూరి జిల్లా, అనకాపల్లి జిల్లా ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ వారంలో ఈ ప్రధాన రోడ్లు మధ్య నాలుగు ప్రమాదాలు జరిగాయి.

గ్రామీణ రోడ్లు మరింత దారుణం

గొలుగొండ నుంచి ప్రముఖ శైవక్షేత్రమైన ధారమఠం శివాలయం రోడ్డు చాలా చోట్ల మరమ్మతులకు గురి కావడంతో భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రోడ్డు అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయింది. నాతవరం-గొలుగొండ మండలాలు కలిపే కురవాడ రోడ్డు మార్గంలో వెంకటాపురం వద్ద రెండు కిలోమీటర్లు రోడ్డు వేయకపోవడంతో ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు మినహా పెద్ద వాహనాలు వెళ్లడం లేదు. ఇలా ప్రతి మార్గంలో రోడ్లు దుస్థితి బాగోలేకపోవడంతో మండల ప్రజలకు ఎటు వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు కూటమి ప్రభుత్వ రోడ్లు అభివృద్ధిపై తక్షణం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి



ప్రధానరోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రోడ్లు వెంటనే అభివృద్ధి చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్లు అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి.
–నారాయణమూర్తి, గొలుగొండ

పాల సేకరణ ధర పెంచాలి


వీరనారాయణం పాల సొసైటీ వద్ద పాడి రైతులతో కలసి నిరసన తెలుపుతున్న వెంకన్న

మాడుగుల రూరల్ : విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పెంచాలని, పాడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరనారాయణం పాల సొసైటీ వద్ద ఆదివారం ఉదయం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఆధ్వర్యంలో పాడి రైతుల ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పాల సేకరణ ధర పెంపు కోసం ఈ నెల 29 వ తేదీన విశాఖ డెయిరీ వద్ద జరపనున్న సమావేశమునికి పాడి రైతులంతా హాజరుకావాలని కోరారు. విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల నుంచి సేకరిస్తున్న పాలధరలు తగ్గించడం అన్యాయమన్నారు. నేడు వ్యవసాయ రంగం లాభ సాటిగా లేకపోవడంతో యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లేక ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 3 లక్షల మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారని అన్నారు. ఆవుపాలు లీటరుకు మూడు రూపాయలు తగ్గించడం వల్ల పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాల సేకరణ ధర పెంచి పాడి రైతులను ప్రోత్సహించాలన్నారు. రెండు సంవత్సరాలుగా పాడి రైతులకు బోనస్ ఇవ్వలేదన్నారు. ఈ నెల 29 న డెయిరీ వద్ద జరిగే సమావేశానికి మూడు జిల్లాల రైతులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరటా నర్సింహమూర్తి, నాయకులు బి.టి.దొర, అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

- శివాలయాల ముస్తాబు
- పూజలకు ఏర్పాట్లు
- నెల రోజుల పాటు గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి


కె.జె.పురంలో ఉమా భీమాలింగ స్వామి వారి ఆలయం


ఉమా భీమాలింగేశ్వరునికి అభిషేకాలు


జంపెనలో భీమలింగేశ్వరుడు

మాడుగుల రూరల్ : వచ్చే నెల 2 వ తేదీ నుంచి కార్తీక మాసానికి మండలంలో శివాలయాలు ముస్తాబు చేశారు. మండలంలో కె.జె.పురం, వీరవల్లి అగ్రహారం, జంపెన, వీరనారాయణం, వి.జె.పురం, పిట్టగెడ్డ, మాడుగుల దబ్బకుంటు రహదారిలో గల ఉమా పార్వతీ భీమేశ్వరుని ఆలయంతో పాటు కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో గల శివాలయంలో, ఎం. కోడూరులో కాశీ విశ్వేశ్వరుని ఆలయంతో పాటు మాడుగులలో గల పార్థ సారథి, ఉబ్బలింగేశ్వరుడు, పలు శివాలయాల్లో కార్తీక మాసంలో ప్రతి రోజు పూజలు, అభిషేకాలు, కార్తీక సోమవారాల్లో పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవం ప్రారంభం, అదే రోజు నుంచి ఆకాశ దీపార్చన, ప్రారంభం అవుతుందని ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ వారు తెలిపారు. వచ్చే నెల 4, 11, 18, 25, తేదీల్లో కార్తీక సోమవారాలతో పాటు వచ్చే నెల 12 కార్తీక ఏకదశి పర్వదినం, 15న కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 1 న కార్తీక అమావాస్య, 2న పోలిపాడ్యమితో కార్తీక మాసం పూర్తి అవుతుంది. కార్తీక సోమవారాల్లో శివాలయాలల్లో ప్రత్యేక దర్శనాలు, అభిషేకాలు, రాత్రి సమయంలో ప్రతి రోజు ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపార్చన కార్యక్రమం జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు.

రైవాడ కెనాల్‌లో నాచు, మొక్కల తొలగింపు


ఉగ్గినవలస కెనాల్ మార్గంలో నాచును తొలగించే పనుల్లో లష్కర్‌లు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల మీదుగా వెళ్లే రైవాడ కెనాల్ మార్గంలో నీటి అడుగున పెద్ద ఎత్తున పేరుకుపోయిన నాచు, మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని జీవీఎంసీకి చెందిన లష్కర్‌లు చేపడుతున్నారు. ఈ పనులను ఆదివారం ఉగ్గినవలస-కేఆర్ పేట కెనాల్ మార్గంలో జరిపారు. నాచు, మొక్కలు పెద్ద ఎత్తున పేరుకుపోవడం వల్ల జలాశయం నుంచి ప్రతి రోజూ విశాఖపట్నానికి ప్రవహించే 50 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా కెనాల్‌లో నాచు, మొక్కలను తొలగింపు పనులు చేపడుతున్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న సహాయ సంక్షేమాధికారి గోపీనాథరావు

నర్సీపట్నం : బీసీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను వెనకబడిన తరగతుల సహాయ సంక్షేమాధికారి వి.గోపీనాథరావు అందజేశారు. పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం బీసీ బాల, బాలికలకు దుప్పట్లు అందజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని 9 హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్న 1547 మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


మహాశక్తి అవతారంలో మోదకొండమ్మ భక్తులుకు దర్శనమిస్తున్న దృశ్యం

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆదివారం మహాశక్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన 101 ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఉచితంగా ప్రసాదం అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు


గొలుగొండ : నెల రోజుల క్రితం మరణించిన స్నేహితుడి కుటుంబానికి సహచర స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2000–2001బ్యాచ్‌కు చెందిన దారకొండ శ్రీనివాసరావు నెల రోజులు క్రితం చనిపోవడం జరిగింది. ఆయనకు భార్య, కుమార్తె, కమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి మిత్రులంతా కలిసి ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. మీకు అండగా ఉంటామని స్నేహితులు అంతా శ్రీనివాసరావు కుటుంబానికి భారోసా ఇచ్చారు.

స్థిరంగా కోనాం నీటిమట్టం


కోనాం జలాశయం

చీడికాడ : కోనాం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 98.30 మీటర్లు వద్ద ఉంది. ఎగువ, దిగువ కాలువల ద్వారా 200 క్యూసెక్కులు విడుదలవుతుంది. ఇన్ ఫ్లో 20 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే నెలలో 93.40 మీటర్లుగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండదని ఇరిగేషన్ సిబ్బంది చెబుతున్నారు.

పెద్దేరుకు తగ్గిన వరద ముంపు


పెద్దేరు జలాశయానికి తగ్గిన నీటిమట్టం

మాడుగుల : ఇటీవల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు రెండు రోజుల క్రితం వరకు జలాశయంలోకి 500 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరేది. అయితే ఆదివారం నుంచి జలాశయంలోకి ఇన్ ఫ్లో 150 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రధాన పంటకాలువలకు 140 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తుండడంతో జలాశయం పరిధి 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలకు ఢోకా లేదని జలాశయం అధికారులు చెబుతున్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం


కొత్తకోటలో వృద్ధులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

రోలుగుంట : హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సేవా సంఘం(కొత్తకోట) వారి సారథ్యంలో మూడు వందల మంది దివ్యాంగులు, వృద్ధులు, అనాథలు, యాచకులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు నిరుపేద వృద్ధులకు, యాచకులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. బొడ్డుపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సేవాసంఘం నూతన అధ్యక్షుడు గ్రట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి నిరుపేదలు, అనాథలను గుర్తించి వారి ఆకలి తీర్చడమే తమ సేవా సంస్థ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం వ్యవస్థాపకుడు విరోతి ఆనంద్, అధ్యక్షుడు నాగేశ్వరావు, ఉపాధ్యక్షుడు జవ్వాది ఈశ్వరావు, అమిరెడ్డి బద్రి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు గోతుల మయం


గోతుల మయంగా మారిన రోడ్డు

మాకవరపాలెం: రామన్నపాలెం నుంచి జీవెంకటాపురం వెళ్లే రహదారిపై భారీ వాహనాలు తిరుగుతున్నాయి. పరిమితికి మించి అధిక సంఖ్యలో ఈ రోడ్డుపై భారీ క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి పగలు ఎలా ఉన్నా రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని యరకన్నపాలెం, ధర్మవరం, రామన్నపాలెం, సుభద్రయ్యపాలెం, జీ వెంకటాపురం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాహనాలపై చర్యలు తీసుకోవడంతోపాటు రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు

ఆకట్టుకున్న బళ్ల వేషాల ప్రదర్శన


గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం


యమధర్మరాజు, చిత్రగుప్త తదితర వేషధారణలో యువకులు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు గౌరీపరమేశ్వరులను ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. గౌరీపరమేశ్వరుల అనుపు సందర్భంగా బళ్ల వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు యమధర్మరాజు, చిత్రగుప్తుని, శివుని, పార్వతి, రాక్షసుని వేషధారణలతో సందడి చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అనుపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనుపు కార్యక్రమ ఏర్పాట్లను వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణతో పాటు గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

వరిలో సుడిదోమ నివారించాలి


చిరు పొట్ట దశలో వున్న వరి పంట

మాడగుల రూరల్: ప్రస్తుతం వరి పంట చిరు పొట్ట దశ నుంచి పోలు పోసుకోనే దశలో వుందని, ఈ దశలో సుడిదోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుదని, ఈ సుడిదోమ, వరి దుబ్బుల మొదళ్ల ఆశించి నష్ట పరుస్తుందని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఈ సుడిదోమ వల్ల మొక్కలు గిడసబారి పోషకాలు అందక పసుపు రంగుకు మారి సుడులు సుడులుగా ఎండిపోతాయని, వీటి ఉధృతి అధికంగా వున్నప్పుడు వరి కంకి వరకు ఈ తెగుళ్ల ఆశించి నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. ఈ తెగుళ్ల ఆశించిన ప్పుడు మొదట పొలంలో వున్న నీటిని పూర్తిగా తీసి వేసి, రెండు రోజుల పాటు పంట పొలాన్ని పూర్తిగా ఆరబెట్టాలన్నారు. ఈ తర్వాత తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సుడిదోమ ప్రారంభ దశలో ఉన్నట్టయితే ఎసిఫేట్ అనే పొడి మందును ఒక లీటరు నీటికి, 1.5 గ్రాములు కలిపి పంట మీద పిచికారీ చేయాలన్నారు. దోమ ఉధృతి అధికంగా ఉంటే డైనెటోఫ్యూరాన్ అనే మందును ఒక లీటరు నీటికి, 0.4 గ్రాములు చొప్పున లేదా పైమైట్రోజైన్ అనే పొడి మందును ఒక లీటరు నీటికి 05 గ్రాములు కలిపి మొక్కలు మొదళ్ల భాగంలో పడేటట్లు పిచికారి చేయాలన్నారు. దీని వల్ల సుడిదోమ తెగుళ్ల పూర్తిగా తగ్గించవచ్చునని ఏవో తెలిపారు.

నాడు వరదై... నేడు వరమై

- ఏలేరు కాలువ లీకేజీతో ఖరీఫ్‌లో ఏపుగా వరిపంట
- ఏటా లీకేజీతో ముంపునకు గురయ్యే పంట పొలాలు
- మండలంలో 26 కిలోమీటర్ల పొడవునా ఏలేరు కాలువ


ఏలేరు లీకేజీ నీటితో ఏపుగా పెరిగిన వరి పంట


ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ లీకేజీ నీరు


నిండుగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ నీరు

నాతవరం: తుపానుల సమయంలో అధిక వర్షాలు కురిసేటప్పుడు ఏలేరు కాలువలో నీరు లీకేజీ కారణంగా ఏటా దిగువ పొలాలు ముంపునకు గురయ్యేవి. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు కాలువల ద్వారా తరలిస్తున్నారు. మండలంలో పి.జగ్గంపేట, పి.కె.గూడెం, ధర్మవరం, గునుపూడి పెదగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, చిన గొలుగొండపేట, ఎ.పి.పురం మన్యపురట్ల, ఎం.బి.పట్నం, జిల్లేడుపూడి చెర్లోపాలెం పంచాయతీల మీదుగా ఏలేరు కాలువ సుమారుగా 26 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తుంది. జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీలకు చెందిన భూములు మాత్రమే కాలువకు ఎత్తులో ఉండగా మిగతా పంచాయతీలో భూములన్నీ కాలువకు దిగువన పల్లంలో ఉన్నాయి. ప్రతి ఏటా ఏలేరు కాలువకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు వర్షాలు అధికంగా కురిసిన తుఫాన్లు సంభవించిన కాలువలో నీరు ఉప్పొంగి ప్రవహించి వరి పొలం ముంపునకు గురయ్యేవి. పల్లపు ప్రాంతంలో పంట పొలాలు ఉండడంతో అధికారులు ఎన్ని జాగ్రత్తలు చేపట్టినా లీకేజీ నీరు అరికట్టడం లేదు. అయితే ఈ ఏడాది లీకేజీ నీరు ఈ ప్రాంత రైతులకు ప్రధాన ఆధారంగా మారింది. తాండవ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ కాలువలో పూడిక కారణంగా శివారు ఆయకట్టుకు రైతులు ఆశించిన విధంగా నీరు ప్రవహించలేదు. అయితే ప్రాజెక్టు నీటితో పని లేకుండా ఏలేరు లీకేజీతో వరి పంట ఏపుగా పెరుగుతుంది. గతంలో కాలువ నీరు ముంచెత్తడంతో అనేక బాధలు పడేవారమని, అదే నీరు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అదుకుంటుందని ఈ ప్రాంత రైతులు అంటున్నారు.